డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభించాలి



జీఎం రామకృష్ణను కలిసి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కాచిగూడ: నింబోలి అడ్డలోని లాల్ బహదూర్ స్కూల్ రోడ్డు నుంచి చెప్పల్ బజార్ మెయిన్ రోడ్డు వరకు నూతనంగా డ్రైనేజీ పైపులైన్ 10 నెలల క్రితమే మంజూరైనా పైపులు లేవనే సాకుతో ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని, దీంతో స్థానిక ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. గురువారం కాచిగూడ కార్పొరేటర్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు నారాయణగూడలోని జలమండలి జీఎం రామకృష్ణను కలిసి డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులు చేపట్టకుండా రోడ్డు నిర్మాణపు పనులు చేపట్టడం లేదని, గుంతలు పడ్డ రోడ్లతో స్థానిక ప్రజలు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో సుభాష్ పటేల్, మల్లికార్జున్, సాయిబాబా, బి.భీమ్‌రాజ్, బాలప్రసాద్, ఆర్. సంతోష్, ఎస్.రవియాదవ్, సూరి, రాము ఉన్నారు.

18న వీరభద్రస్వామి కల్యాణం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కాసుల వినోద్

కాచిగూడ: ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం, భక్తుల కోరిక మేరకు ఈ నెల 18వ తేదీన కర్మన్‌ఘాట్ ఏపీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే కురవి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొనాలని వీరభద్ర స్వామి సేవా సమితి ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం సాయిబాబా, కాచిగూడలోని పలు ఆలయాలను సందర్శించి ఆహ్వాన పత్రికలను అందజేశారు. దేవాలయానికి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వీరభద్ర స్వామి కల్యాణ వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధులు సాంబశివ శాస్త్రీ, ప్రసాద్‌రావు, పవన్‌కుమార్, కిరణ్ కుమార్, వీరభద్ర సేవా సమితి ప్రతినిధులు శ్వేత, సింగశెట్టి హరిబాబు, మించు ఆనంద్, విష్ణు వర్ధన్ రావు, మార్గం విజయ్ కుమార్, కొండూరు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నాలా పనులను పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట: నాలా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ అధికారులకు సూచించారు. గురువారం డివిజన్‌లోని పటేల్‌నగర్ చౌరస్తాలో నిర్మిస్తున్న నాలా పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నాలా నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే నాలాలో ప్లాస్టిక్, చెత్త పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ రఘు, ఏఈ విశ్వజిత్, ఇతర సిబ్బంది స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్: దిశ, కేంద్ర ప్రభుత్వ డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీస్) సంయుక్తంగా ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని దిశ కార్యాలయంలో గురువా రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధి కార్యాలయ యువ అ.దికారి విజయ్, బీఎస్‌కే డైరెక్టర్ శరత్‌బాబు, దిశ కో-ఆర్డినేటర్లు ఐవాన్‌వాజ్, స్టీవ న్ వెల్లడించారు. 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీ, డిప్లొమా విద్యార్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని మరి న్ని వివరాలకు 89771 75394, 94946 98219 నం సంప్రదించాలన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు



శాసనసభ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసెంబ్లీలో గురువారం ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ప్రకటించారు. ఈ సందర్భంగా పోడియం వద్దకు వెళ్లి స్పీకర్‌ను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. –సాక్షి, సిటీబ్యూరో



చిక్కడపల్లి బస్టాప్ వద్ద ఆటోల అక్రమ పార్కింగ్‌తో స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ పోలీసులూ.. ఇటు చూడరా మీరు?

- అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్
- ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలో గత కొంతకాలంగా రామారాజ్ కాటన్ షాపింగ్ మాల్, శ్రీ చైతన్య ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ వద్ద చేస్తున్న అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ స్తంభించి పోతోందని వాహనదారులు వాపోతున్నారు. దీంతో పాటు చిక్కడపల్లి బస్టాప్ వద్ద సైతం ఇష్టానుసారంగా ఆటోలను నిలపి కాలక్షేపం చేస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుంది. ముఖ్యంగా ప్రధాన రహదారి కావడంతో పాటు అక్కడే మూల మలుపు ఉండడంతో ఇటూ ద్విచక్ర వాహనాలు, అటు భారీ వాహనాలు వెళ్లలేక ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇంత పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నా ట్రాఫిక్ పోలీసులు, అధికారులు మాత్రం తమ పని కాదనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌పై దృష్టి సారించాలని బాటసారులు, వాహనదారులు కోరుతున్నారు.



రామరాజు కాటన్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద అక్రమంగా పార్కింగ్ చేసిన ఆటోలు

తెలుగు భాషాసంపద పరిరక్షణకు బ్రౌన్ కృషి



కార్యక్రమంలో పాల్గొన్న దామోదర్‌గుప్తా, జనార్ధనమూర్తి

చిక్కడపల్లి: ఎక్కడో బ్రిటన్ దేశంలో పుట్టి అధికార బాధ్యతపై తెలుగు రాష్ట్రానికి వచ్చిన సీపీ బ్రౌన్ తెలుగు భాషా పరిరక్షణకు పాటు పడ్డారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటీ దామోదర్ గుప్తా అన్నారు. గురువారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా సీపీ బ్రౌన్ సంసర్మణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామోదర్ గుప్తా మాట్లాడుతూ.. వేమన కవి శతక పద్యాలను పలువురు పండితులకు తన సంపాదన నుంచి వేతనాలు ఇచ్చి పరిష్కరించిన సహృదయుడు బ్రౌన్ అని అన్నారు. ప్రముఖ పత్రిక రచయిత జయసూర్య మాట్లాడుతూ.. తెలుగును ఆంగ్లంలో తర్జుమా చేసి నిఘంటువును తయారు చేసిన బ్రౌన్‌ను ప్రతి తెలుగువారు ఎప్పటికి గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత గురువు అపర్ణ, గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి కృషి



ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని సత్కరిస్తున్న సిబ్బంది

ముషీరాబాద్: ప్రజా సేవ చేయడానికి ఎమ్మెల్యేగా పోటీ చేశానని బాజపా ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక్క రూపాయి ఓపీ వైద్యం నిర్వహిస్తున్న సిబ్బంది ఆయనను కలిసి సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అందులో భాగంగానే ఏడాదిగా బాగ్‌లింగంపల్లిలో తాను ఒక్క రూపాయికే వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరికొన్ని చోట్ల కూడా ఒక్క రూపాయికే ఓపీ వైద్యం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి, రేవతిరెడ్డి, డీఎస్ఎస్ గంగాధర్‌గుప్తా, శ్రేష్టి, సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షయ్‌కుమార్ దత్ జీవితం ఆదర్శప్రాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర సలహాదారులు సామాజికవేత్త ఎం.అక్షయ్‌కుమార్‌దత్ సంస్మరణ సభ గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. అక్షయ్‌కుమార్ దత్ జీవితం పలువురికి ఆదర్శప్రాయమన్నారు. సుమారు 50 సంవత్సరాలు ఉపాధ్యాయ ఉద్యమానికి సేవలందించారని ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నామన్నారు. జేఎన్‌టీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎల్.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఎంతో చురుకుగా సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారని ఆయన గొప్ప సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌వీ రాష్ట్ర కోశాధికారి ఎం.రాధేశ్యామ్, నగర కోశాధికారి ఎస్.వి.రామకృష్ణ, అక్షయ్‌కుమార్ దత్ సతీమణి లలితదత్, టీపీఎస్‌వీ ఉపాధ్యక్షులు మంగా, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఉపాధ్యాయులు

కాచిగూడ: అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ.. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాణి సక్కుబాయి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల బదిలీలలో నాన్ స్పౌజ్ (భార్యాభర్తల్లో ఎవరో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి) ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివక్షతను సరి చేయాలని, తద్వారా ఉపాధ్యాయుల మధ్య సమానత్వాన్ని కాపాడాలని ఆమె కోరారు. అర్ధంతరంగా ఆగిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు రాబోయే వేసవి సెలవులలో జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. శేఖర్, కృష్ణకుమారి, రూపరాణి, సావిత్రి, వెంకటరెడ్డి, పద్మారెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య సీఎంను కలిశారు.

రేపు కర్ణాటక ఫుడ్ ఫెస్టివల్

కాచిగూడ: కర్ణాటక శిక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 16న శనివారం కాచిగూడ, లింగంపల్లిలోని నృపతుంగ స్కూల్ క్యాంపస్‌లో కర్ణాటక ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు సురేంద్ర కులకర్ణి తెలిపారు. ఫుడ్ స్టాల్స్, కమర్షియల్ స్టాల్స్ కోసం వివరాలకు 9849659041 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: టీ-సేవ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 3600 మంది మహిళలకు 'స్త్రీ శక్తి స్వయం ఉపాధి కంప్యూటర్ శిక్షణ పథకం ' ద్వారా శిక్షణ తరగతులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ చేసిన నిరుద్యోగ మహిళలు ఈ నెల 26వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 8179955744 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని హనుమాన దేవాలయంలో గురువారం హుండీ లెక్కించగా రూ. 1,54,696 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. ఆలయ చైర్మన్ బాసాని పద్మసూర్యప్రకాశ్, ఆలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులు గణేష్, డాక్టర్ రామకృష్ణ, రమణ, అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, వెంకటాద్రి, లెక్కింపులో పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జూపల్లి కృష్ణారావుకు కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపా రు. గురువారం మంత్రి నివాసంలో కల్లుగీత కా ర్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

టీబీపై అవగాహన ర్యాలీ

రసూల్‌పురా: హ్యూమన్ పీపుల్ టు పీపుల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీబీ కోహఠావో కార్యక్రమంలో భాగంగా రసూల్‌పురాలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రసూల్‌పురా, జగదీష్‌నగర్, ఇందిరమ్మనగర్ బస్తీల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ క్షయవ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జీ టీఎన్. శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు పేదల ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మహిందర్ సింగ్, మనీష్, భూదేవి, అషాయ్‌బబ్బీ, ఆఫ్రీన్, దివ్య, స్థానిక నేతలు దేవులపల్లి శ్రీనివాస్, శాంరెడ్డి, గఫర్,నాసర్ పాల్గొన్నారు.

ఓయూ సాహిత్య వేదిక వార్షికోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సాహిత్య వేదిక 6వ వార్షికోత్సవం కవులు, కళాకారులు, రచయితలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటలు, పద్యాలు, వచన కవితలతో సాహిత్యాభిలాషులను అలరించారు. తెలుగుశాఖ అధ్యాపకులు ప్రొ.కాశీం, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అక్కిరాజు రామకృష్ణారావు, యామిని, రమేష్, రేలారే గంటా తదితరులు పాల్గొని మాట్లాడారు.

తెలుగు ప్రజల భాషా స్థితిగతులే గ్రంథాలయాల ఏర్పాటుకు దోహదం

డాక్టర్ చేగోని రవికుమార్



జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ చేగోని రవికుమార్

కవాడిగూడ: నిజాం పరిపాలనలో తెలంగాణలో నివసిస్తున్న తెలుగు ప్రజల భాషా స్థితిగతులే గ్రంథాలయాల ఏర్పాటుకు దోహదపడ్డాయని డాక్టర్ చేగోని రవికుమార్ పేర్కొన్నారు. గురువారం జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి సందర్భంగా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో దోమలగూడ గగన్ మహల్ ఏవీ కళాశాలలో నిర్వహించిన వేమన ఆంధ్రాభాషా నిలయం శతాబ్ది ఉత్సవాల్లో డాక్టర్ చేగోని రవికుమార్ పాల్గొని మాట్లాడారు. కొండా వెంకటరంగారెడ్డికి ప్రజాకవి వేమన సాహిత్యం పట్ల అభిమానంతో వేమన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారని, ఏవీ విద్యా సంస్థలతో పాటు మెడికల్ కాలేజీలను కూడా స్థాపించినట్లు తెలిపారు. గ్రంథాలయంలో మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. గ్రంథాలయాలు మనుషులకు దీపాల వంటివని పేర్కొన్నారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర విముక్తి గురించి తెలుసుకోవడానికి తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన గ్రంథాలు, చరిత్రకు సంబంధించిన పుస్తకాలతో పాటు గ్రంథాలను నేటి యువత చదవాలన్నారు. రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు కమ్యూనిటీ సెంటర్ వంటివని ఈ నాటి గ్రంథాలయాల్లో ఆధునిక టెక్నాలజీ పెంచుకొని గ్రంథాలయాలు విద్యార్థులకు మరింత తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు రాంచంద్రారెడ్డి, ఏవీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గౌతమి, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం. భగవంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్ రాజలింగం, లా కళాశాల ప్రిన్సిపాల్ కె.జైపాల్‌రెడ్డి, సమన్వయకర్తలు రవీంధర్, ప్రతిభ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన స్టాఫ్ నర్స్ జేఏసీ నేతలు



మంత్రి దామోదర రాజనర్సింహతో జేఏసీ నేతలు

కవాడిగూడ: ఆగస్టు నెలలో నోటిఫికేషన్ ప్రకారం రాసిన 5204 పోస్టులతో పాటు అనంతరం ఫైనాన్సిల్ అప్రూవల్ ఇచ్చిన 1827 పోస్టులను కలిపి 7031 పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు గోవర్ధన్, వెంకటేష్, యశ్వంత్ మాట్లాడుతూ.. ఒకే సిలబస్ ఒక పరీక్ష విధానం ఉన్నందున మరోసారి నోటిఫికేషన్ ఇవ్వడంతో నర్సులకు ఆర్థిక, మానసికంగా ఇబ్బందులకు గురికాకుండా ఉంటుందన్నారు. 2017లో మొదట 1197 పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి తరువాత వాటికి మరికొన్ని పోస్టులు కలిపి మొత్తం 3311 పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో లక్ష్మణ్, అనిత, అర్చన, నవీన ఉన్నారు.

కాంగ్రెస్, మజ్లిస్, బీఆర్ఎస్ ఒక్కటే



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కాచిగూడ: రాష్ట్రంలోని కాంగ్రెస్, మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, ఎన్నికల ఫలితాల తర్వాత ఈ మూడు పార్టీల వ్యవహార శైలి దీనికి నిదర్శనమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆరోపించారు. గురువారం బర్కత్ పురలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన సభ ప్రొటెం స్పీకర్ ఎంపిక, మజ్లిస్ ఎమ్మెల్యేలతో హైదరాబాద్ నగరాభివృద్ధి సమావేశం తదితర అంశాలలే నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్‌ను శాసించిన మజ్లిస్.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీని శాసిస్తోందన్నారు. ఉచిత హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోస ం బీజేపీ ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో దేశ ప్రజల తీర్పు మళ్లీ నరేంద్రమోదీ వైపే ఉంటుందని, ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. నందకిషోర్ యాదవ్, శ్యాంరావు, సూర్యప్రకాష్ సింగ్, అజయ్‌కుమార్, కన్నె రమేష్ యాదవ్, వినోద్ యాదవ్, జగన్, కృష్ణాగౌడ్, సందీప్ పాల్గొన్నారు.

ఓయూలో బారికేడ్ల జగడం



విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గతంలో ఏర్పాటు చేసిన ముళ్ల కంచెలు, బారికేడ్లను తొలగించాలని విద్యార్థులు వారం రోజులుగా చేపట్టిన ఆందోళన తీవ్రరూపం దాల్చింది. గురువారం ఐక్య విద్యార్థుల ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీ నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ చేపట్టారు. పరిపాలన భవనం గేట్లు మూసివేయడంతో ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఓయూలో ఏర్పాటు చేసిన పోలీసుల బారికేడ్ల, పరిపాలన భవనానికి అమర్చిన ఇనుప ముళ్ల కంచెను తొలగించి ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ వీసీ ప్రొ.రవీందర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. పాలన భవనం చుట్టూ ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను తొలగించేందుకు యత్నించిన విద్యార్థులను బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థులకు నడుమ పెనుగులాట జరిగింది. విద్యార్థులకు మద్దతుగా లా కాలేజీ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్ కుమార్ పాల్గొని అధికారుల తీరు పై మండిపడ్డారు. కార్యక్రమంలో బైరు నాగరాజుగౌడ్, నెల్లి.సత్య, గ్యార నరేష్, ఆజాద్, వలిగొండ నరసింహ పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో రూ. 56 వేలు టోకరా

అడ్డగుట్ట: ఉద్యోగం పేరుతో ఓ యువతిని మోసం చేసి రూ. 56 వేలు కాజేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరా ల ప్రకారం.. ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన సింధులక్ష్మికి (24) వారం రోజుల క్రితం ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము నౌక్రీ డాట్ కమ్ నుంచి మాట్లాడుతున్నామని బై జూస్ లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అప్లికేషన్ ఫామ్ కోసం రూ. 3 వేలు, అన ంతరం ఇంటర్వ్యూ చేసి సెలక్ట్ అయినట్లు చెప్పి డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం రూ. 8 వేలు తీసుకున్నారు. ఇలా పలు కారణాలు చెబుతూ మొత్తం రూ.56 వేలు తీసుకుని, ఉద్యోగానికి సంబంధించి ఎలాంటి వివరాలు చెప్పకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఓయూ క్యాంపస్‌లో కొత్త విద్యార్థుల కోలాహలం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో కొత్త విద్యార్థుల రాకతో యూనివర్సిటీ అంతట కోలాహలంగా మారింది. యూనివర్సిటీ క్యాంపస్‌లోని 9 కాలేజీలో నూతన విద్యార్థులతో సందడి వాతావరణం నెలకొంది. ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీల విద్యార్థులు మొదలు ఎంబీఏ, ఎంఈఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఈడీ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సులలో ప్రవేశాలు, చివరకు లా కాలేజీ విద్యార్థుల చేరికతో క్యాంపస్ అంతా విద్యార్థులతో కళకళలాడుతోంది. ఓయూలో అన్ని రకాల మౌలిక వసతులున్నా అధ్యాపకుల కొరత కారణంగా విద్యార్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

క్రైస్తవులకు సహకరించాలంటూ వినతి

రాంగోపాల్‌పేట్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులకు పోలీసులు సహకరించి, రక్షణ కల్పించాలని ఏఐసీసీ మైనార్టీ విభాగం జాతీయ కో ఆర్డినేటర్ గద్దపాటి విజయరాజు పోలీసులను కోరారు. గురువారం ఆయన అదనపు డీజీ (శాంతిభద్రతలు) సంజయ్‌కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 24వ తేదీ వరకు ప్రతి రోజు వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయని, క్రీస్తు జనన సందేశాన్ని తోటి క్రైస్తవులతో పంచుకునేందుకు పాటలను పాడుతూ వారి గృహాలను సందర్శిస్తారని తెలిపారు. రాత్రి 6 గంటల నుంచి మధ్య రాత్రి వరకు ఇవి జరుగుతాయని కాబట్టి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి పెట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేలా ఆదేశాలివ్వాలని వినతి పత్రంలో కోరారు. అలాగే డిసెంబర్ 31వ తేదీ రాత్రి కూడా క్రైస్తవులు ప్రార్థనల్లో గడుపుతారని అందువల్ల ఈ పర్వదినాలను క్రైస్తవులు ప్రశాంతంగా నిర్వహించుకునేలా ప్రత్యేక చొరవతీసుకోవాలని సూచించారు. వినతి ఇచ్చిన వారిలో డేవిడ్ శాంతరాజ్, టీడీఎస్ మణి, డేవిడ్ కడారి ఉన్నారు.